సాక్షి చిత్తూరు
శనివారం ၊ 11 ၊ అక్టోబర్ ၊ 2025



చదువు చెప్పకపోవడమే పెద్ద అవినీతి
చదువు చెప్పకపోవడమే పెద్ద అవినీతి అని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ నూతన అయ్యోర్లకు హితబోధ చేశారు. - 8లో



ముంచేసిన వాన
చిత్తూరులో వాన దంచికొట్టింది. పంట పొలాలు, కాలనీల్లోకి నీళ్లు చేరాయి. నిత్యావసరాలు తడిసి ముద్దయ్యాయి. - 8లో



మైండ్ బ్లాంక్!
కొత్త టీచర్ల కౌన్సెలింగ్ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోంది. 500 పోస్టులు బ్లాక్‌లో పెట్టడం విమర్శలకు తావిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

త్వరలో కానిస్టేబుళ్లకు శిక్షణ



సూచనలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

చిత్తూరు అర్బన్: ఇటీవల వెలువడ్డ పోలీసు కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు చిత్తూరు నగరంలోని జిల్లా పోలీసు శిక్షణా కేంద్రం (డీటీసీ)లో త్వరలోనే శిక్షణ ప్రారంభమవుతుందని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శుక్రవారం అధికారులతో కలిసి డీటీసీని పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ శిక్షణలో కనీస వసతులు, సదుపాయాలు పక్కాగా ఉండాలన్నారు. ఏఆర్ ఏఎస్పీ శివానంద కిషోర్, డీఎస్పీ మహబూబ్, సీఐలు అమర్‌నాథరెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

విచారణ అధికారి నియామకం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఎస్ఆర్‌పురం మండలం తహసీల్దార్‌గా షబ్బీర్‌బాషా (ప్రస్తుతం కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్నారు) పనిచేసే సమయంలో ఏసీబీకి పట్టుబడ్డారు. ఈ ఘటన 2023 మార్చి 21న జరిగింది. ఆయనతో పాటు తయ్యూరు వీఆర్‌వో గోవిందరెడ్డి సైతం ఈ కేసులో పట్టుబడ్డారు. వారిపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ నమోదు చేస్తూ ఈ నెల 10న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఇద్దరినీ విచారించేందుకు చిత్తూరు జాయింట్ కలెక్టర్‌ను విచారణ అధికారిగా నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం పేదల ప్రాణాలతో చెడుగుడు ఆడుతోంది. అపర సంజీవినిగా ఉన్న ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ఏడాదిగా బకాయిలు చెల్లించకుండా నెట్‌వర్క్ ఆస్పత్రులను వేధిస్తోంది. ఇక తమవల్ల కాదంటూ ఆస్పత్రుల నిర్వాహకులు చేతులెత్తేసేలా చేసింది. ఫలితంగా శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. రోగుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

ఆగిన ఊపిరి!

- జిల్లాలో నిలిచిపోయిన ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు
- ఆషా పిలుపు మేరకు బంద్ పాటించిన నెట్‌వర్క్ ఆస్పత్రులు
- పేరుకు పోయిన బకాయిలు
- పట్టించుకోని కూటమి నేతలు
- అయోమయంలో పేద రోగులు



ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్టు వెలిసిన బోర్డులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆపన్నులకు అపర సంజీవనిగా నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు అర్ధంతరంగా ఆగిపోయాయి. ఈ పథకం కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఏడాదికి పైగా కోట్లాది రూపాయల మేర బకాయిలు పేరుకుపోయాయి. ఈ బకాయిల గుదిబండను మోయలేమంటూ జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రులు చేతులెత్తేశాయి. ఆషా (ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్) పిలుపు మేరకు శుక్రవారం నుంచి జిల్లా వ్యాప్తంగా బంద్ పాటించాయి.

బకాయిలు రూ.120

జిల్లాలోని ఎన్టీఆర్ వైద్య సేవల నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం సుమారు రూ.120 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో ఆస్పత్రికి కోట్లల్లో బకాయిలున్నట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర అవుతోంది. ఈ బకాయిలు కూడా ఏడాది నుంచి తొమ్మిది నెలల కాలంలో ఉన్నవే. వీటిని వెంటనే విడుదల చేయాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) నెల రోజుల క్రితం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ స్పందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల సేవల నిలిపివేత అనివార్యమైంది. ఇంతకాలం పంటి బిగువన సమస్యలు భరించామని, ఇక తమ వల్ల కాదని నెట్‌వర్క్ ఆస్పత్రులు స్పష్టం చేస్తున్నాయి. కోట్లాది రూపాయల మేర బకాయిలు చెల్లించకపోతే తాము ఎంత కాలం వైద్య సేవలు అందించగలమని ప్రశ్నిస్తున్నాయి. చిత్తూరు నగరంలోని కార్పొరేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనూ ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. బంద్ పాటిస్తున్నట్లు ఆస్పత్రి ఎదుట నోటీసులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాయి.

సామాన్య జనం అవస్థ

నెట్‌వర్క్ ఆస్పత్రులు బంద్ పాటించడంతో సామాన్య జనం ఓపీకి క్యూకట్టాయి. 'ఈరోజు నుంచి ఆరోగ్య శ్రీ సేవలు బంద్' అంటూ నిర్వాహకులు చెప్పడంతో అవస్థలు పడ్డారు. కొంతమంది డబ్బులిచ్చి వైద్య సేవలు చేయించుకున్నారు. మరికొంత మంది ప్రభుత్వాస్పత్రుల్లో చూపించుకున్నారు. ఇంకొంత మంది ఇంటిబాట పట్టారు.



ఆరోగ్య శ్రీ హెల్ప్ డస్క్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పేదలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించింది. క్యాన్సర్ వంటి ఖరీదైన జబ్బుల చికిత్సకు పరిమితి లేకుండా సాయం అందించింది. ఈ పథకం కింద 1,059 ప్రొసీజర్లు అందిస్తుండగా... గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ సంఖ్యను ఏకంగా 3,257కి పెంచారు. అంతే కాకుండా, కుటుంబానికి రూ.5 లక్షల వరకూ ఉన్న చికిత్స పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచారు. జిల్లాలో ఆరోగ్య శ్రీ అనుమతి ఉన్న ఆస్పత్రుల్లో ప్రతి రోజూ 2,500 వరకూ ఓపీ నమోదవుతుండగా ఇన్ పేషెంట్లుగా ఐదారు వందల మంది వరకూ ఈ పథకం కింద చేరుతున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని రోగులకు ప్రతి నెలా రూ.2 కోట్ల విలువైన శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని అంచనా.

ఆరోగ్యశ్రీ సేవల వివరాలు

నెల	సర్జరీల సంఖ్య	వ్యయం రూ.కోట్లలో
మే	12,003	22,65,04,414
జూన్	11,642	23,34,29,506
జూలై	13,187	23,34,29,506
ఆగస్టు	11,601	21,95,32,242

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు


మొత్తం నెట్‌వర్క్ ఆస్పత్రులు	74
ప్రభుత్వాస్పత్రులు	04
పీహెచ్‌సీలు	47
పీహెచ్‌సీ ఆస్పత్రులు	9
ప్రైవేటు నెట్‌వర్క్	7
డెంటల్ క్లినిక్	7



రక్షణ లేదు!



చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రక్షక్ వాహనం ఇది. జీపు నిండా రంధ్రాలు.. ఎప్పుడు ఊడిపోతాయో తెలియని టైర్లు. కాస్త వేగం వెళితే కింద పడిపోయే జీపు వస్తువులు. మొత్తంగా నగరంలో శాంతి భద్రతల పర్యవేక్షణ, నిందితులకు జైలుకు తరలించేప్పుడు ఉపయోగించడానికి ఇదే వాహనాన్ని వాడుతున్నారు. సొంతలాభం కొంత మానుకో..! అన్నట్లు అధికారులు కాస్త ఇలాంటి వాటిని బాగుచేయించడంపై దృష్టి పెడితే బాగుంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. - చిత్తూరు అర్బన్







క్లుప్తంగా

చిత్తూరులో అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.28 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం



నిందితుడిని అరెస్టు చూపిస్తూ.. వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డ అంతర్రాష్ట్ర నేరస్తుడు హెచ్.హనుమంతప్ప (27)ను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి దాదాపు రూ.28 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ద్విచక్ర వాహనం, నగదు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఏఆర్ పోలీసు కార్యాలయంలో చిత్తూరు డీఎస్పీ సాయినాథ్, టూటౌన్ సీఐ నెట్టికంటయ్య, ఎస్ఐ రమేష్‌తో కలిసి మీడియాకు వివరాలను వెల్లడించారు. గతనెల 30న నగరంలోని రామ్‌నగర్ కాలనీకు చెందిన అల్తాఫ్ అనే వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు పగులగొట్టి.. ఇంట్లో ఉన్న 150 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నగరంలోని చిత్తూరు–కాణిపాకం బైపాస్ వద్ద కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన హనుమంతప్పను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. చిత్తూరులో జరిగిన చోరీతో పాటు అనంతపురంలోని ఓ ఇంట్లో 60 గ్రాముల బంగారు, రూ.2 లక్షల నగదు, ఓ ద్విచక్ర వాహనం కూడా తానే చోరీ చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. నిందితుడి నుంచి రూ.25 లక్షల విలువచేసే 210 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు, ఓ ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయమూర్తి హాజరుపరచగా, రిమాండుకు ఆదేశించడంతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామానికి చెందిన వివాహిత బుధవారం అదృశ్యమైంది. శుక్రవారం భర్త ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అన్ని ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేదని , తన భార్య అకస్మాత్తుగా ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పనితీరును పర్యవేక్షించండి



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : మండల ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి అభివృద్ధి పనుల పనితీరును కచ్చితంగా పర్యవేక్షించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్‌లోపు పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో నిర్వహిస్తున్న పనులను త్వరతిగతిన పూర్తి చేయాలన్నారు. నవంబర్‌లోపు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

- చిత్తూరులో వర్ష బీభత్సం
- ఇళ్లల్లోకి భారీగా వరద
- ముంపునకు గురైన నీవానది లోతట్టు ప్రాంతాలు
- కాలనీల్లో నిలిచిన రాకపోకలు
- అప్రమత్తమైన కార్పొరేషన్ అధికారులు
- ఎమ్మెల్యే ఎక్కడ? ఇచ్చిన హామీ ఏమైంది?

ముంచేసిన వాన



చిత్తూరు నగరంలోని వీరభద్రకాలనీ, తేనబండ వద్ద నివాసాల మీదుగా నీవానది ప్రవాహం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరాన్ని వర్షం అతలాకుతలం చేసింది. లోతట్టు ప్రాంతాలను ముంచేసింది. ప్రజలు నివసిస్తున్న ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. బియ్యం, ఉప్పు, పప్పు ఇతర నిత్యావసర వస్తువులు కొట్టుకుపోయాయి. అందరూ గాఢ నిద్రలో ఉండగా ఇళ్లల్లోకి వరద నీరు రావడంతో గందరగోళం ఏర్పడింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రమాదం చోటుచేసుకోలేదు.

నిత్యావసరాలు నీటిపాలు

నీవానది పరివాహక ప్రాంతాల్లోని చాలా ఇళ్లల్లోకి వరదనీళ్లు రావడంతో ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులన్నీ కొట్టుకుపోయాయి. ఈశ్వరుని గుడివీధి నుంచి సంతపేటకు వెళ్లే దారిపై ఏర్పాటు చేసిన పది విద్యుత్ స్తంభాల్లో తొమ్మిది పడిపోయాయి. ఇక కైలాశపురం, తేనబండ, ధర్మరాజులు గుడి ప్రాంతాల్లో రోడ్డుపైనే నీవానది ఉధృతంగా ప్రవహించింది. రాకపోకలు స్తంభించిపోయాయి.

అధికారుల అలెర్ట్

లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రజలు నీటి ఉధృతివైపు వెళ్లకుండా పెద్దపాటి రోప్‌లను ఏర్పాటు చేశారు. పలువురు వృద్ధులను ఇళ్ల నుంచి బయటకు తీసుకొచ్చి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్యతో పాటు పెద్ద సంఖ్యలో పోలీసులు నీటి ప్రవాహాల వద్ద కాపలా ఉంచారు. మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్, తహసీల్దారు కులశేఖర్, ప్రజారోగ్యశాఖ అధికారి డా.లోకేష్ బృందం లోతట్టు ప్రాంతాల్లో పర్యటించింది. నీవానదిలో నాలుగు ప్రాంతాల్లో స్థానిక ప్రజలు రాకపోకలు సాగించడానికి పెద్దపాటి పైపులను ఏర్పాటు చేయడంతో నీటి ప్రవాహం ముందుకు వెళ్లలేక పోయింది. దీంతో అధికారులు జేసీబీ సాయంతో వాటిని ధ్వంసం చేశారు. దీంతో కాలనీల్లోకి వచ్చిన నీళ్లు, నదిలోకి వెళ్లిపోయాయి. వరద ప్రాంతాల్లోని ప్రజలకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం అందించారు.

ఒక్క వర్షానికే..

చిత్తూరు నగరంలో గురువారం రాత్రి దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. నగరంలోని నీవానదిలో నీటి ప్రవాహం ప్రారంభమయ్యాయి. చిన్నపాటి వర్షమే కదా, అని ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే తమిళనాడు, యాదమరి ప్రాంతాల నుంచి వర్షపునీళ్లు కాలువల ద్వారా ప్రవహిస్తూ నీవానదిలోకి వచ్చాయి. దీంతో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల ప్రాంతంలో నీవానది పరివాహక ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీళ్లు చేరాయి. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న ప్రజల్ని చుట్టుపక్కల వాళ్లు అప్రమత్తం చేయడంతో అందరూ మేల్కొన్నారు. తేనబండ, వీరభద్రకాలనీ, ధర్మరాజులుగుడి వీధి కాలనీ, తోటపాళ్యం, కైలాశపురం, సంతపేట, దొడ్డిపల్లె ప్రాంతాల గుండా నీవానది ఉధృతంగా ప్రవహించింది. ఉదయం 10 గంటల వరకు కూడా ప్రవాహం తగ్గలేదు. మధ్యాహ్నానికి కాస్త తగ్గుముఖం పట్టింది.



చిత్తూరులో ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్, తహసీల్దార్

ఇచ్చిన హామీ ఎక్కడ?



నీవానది పరివాహక ప్రాంతంలో రిటైన్‌వాల్ ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తోంది. గోడ ఎక్కడ నిర్మించారు..? కార్పొరేషన్ నిధులతో ప్రజలకు భోజనాలు అందిస్తే, ఎమ్మెల్యే ఏదో దానం చేసినట్లు ప్రచారం చేయించుకుంటున్నారు. చిత్తూరు ప్రజల ఇబ్బందులు చూడటానికి కూడా ఎమ్మెల్యేకు సమయంలేదా..? అసలు ఎమ్మెల్యే ప్రజలు అందుబాటులో ఎక్కడున్నారు..? కార్పొరేషన్ అధికారులు వరదల పేరిట, నీవానది శుభ్రత కోసం ఎంత ఖర్చు చేశారు..? ఏ నాయకుడి జేబులు నింపుతున్నారనే వివరాలు కూడా త్వరలోనే ప్రజల ముందు ఉంచుతాం.

– విజయానందరెడ్డి, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త, వైఎస్సార్‌సీపీ

కుప్పంలో భారీ వర్షం

కుప్పం: కుప్పంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. పట్టణంలోని మర్రిమానువీధి ఆవుల షెడ్డులో గోడకూలి సుమారు రూ.లక్ష విలువ చేసే ఆవు మృతి చెందింది. గుడిపల్లి ప్రాంతంలో భారీ శబ్దాలతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఈ వర్షానికి విద్యుత్ స్తంభాలు, లైన్లు దెబ్బతిన్నాయి. వరికి భారీ నష్టం వాటిల్లింది. స్థానికులు భయాందోళనకు గురయ్యారు.



చిత్తూరులో భోజనాలు అందిస్తున్న కార్పొరేషన్ అధికారులు



చిత్తూరు తేనబండ వద్ద వరద నీటిలోనే రాకపోకలు



చిత్తూరు రాజుగుడి వద్ద వర్షానికి తెగిన రహదారి



కుప్పం: గోడకూలి మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ దుర్మార్గం

- కోటి సంతకాల సేకరణ పోస్టర్ల ఆవిష్కరణ
- అందరూ కలసికట్టుగా పోరాడుదామని పిలుపు

మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణపై వైఎస్సార్‌సీపీ నేతలు భగ్గుమన్నారు. ఇది ముమ్మాటికీ దుర్మార్గమని దుయ్యబట్టారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు శుక్రవారం జిల్లా వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం తమ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తెచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వాటిని ప్రయివేటీకరణ చేయాలనుకోవడం దారుణమన్నారు. దీన్ని అడ్డుకుంటామని ప్రతిన బూనారు. – చిత్తూరు అర్బన్/ బంగారుపాళెం/ పలమనేరు/నగరి/ కుప్పం/ కార్వేటినగరం



నగరి: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి



చిత్తూరు: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలమనేరు నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేగౌడ



బంగారుపాళెం: పోస్టర ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, లలితకుమారి



కుప్పంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



కార్వేటినగరం మండలంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త కృపాలక్ష్మి

మైండ్ బ్లాంక్!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 500 పోస్టులకుపైగా బ్లాక్
- నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా కౌన్సెలింగ్
- నష్టపోయామంటున్న నూతన అయ్యోర్లు

చిత్తూరు కలెక్టరేట్ : కొత్తగా ఉద్యోగంలోకి వచ్చిన డీఎస్సీ నూతన టీచర్లకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టింది. ఈ నెల 9, 10 తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహిస్తున్న పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ ప్రక్రియను నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తోంది. తమకు నచ్చిన విధంగా కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టింది. పోస్టింగ్‌ల కౌన్సెలింగ్‌లో నిబంధనలను అమలు చేయకుండా సూచించిన చోటే కోరుకోవాలని నియంతృత్వంగా వ్యవహరిస్తోంది. ఏకంగా 500 పోస్టులకు పైగా బ్లాక్ చేయడం దుమారం రేపుతోంది.

ఎప్పుడూ ఇలా లేదు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా హెచ్‌ఆర్‌ఏ పేరుతో (కేటగిరీ 1, 2) పోస్టులను 500కు పైగా బ్లాక్ చేశారు. కొత్త టీచర్లకు హెచ్‌ఆర్‌ఏ పోస్టులు ఇవ్వకూడదనే నిబంధన ఎక్కడా లేదు. ఇలా బ్లాక్ చేసిన పోస్టులన్నీ ప్రధాన ప్రాంతాల్లో ఉండడంతో వాటిని డిప్యూటేషన్స్ (ప్రభుత్వ ఆర్డర్) పేరుతో దోచుకునేందుకు కుట్ర చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. గతంలో డీఎస్సీ పోస్టింగ్‌లు ఇచ్చే సమయంలో పోస్టులను బ్లాక్ చేసిన సందర్భాలు లేవని యూనియన్ నాయకులు వాదిస్తున్నారు.

లోగుట్టుగా కౌన్సెలింగ్ ప్రక్రియ

తిరుపతి జిల్లా కేంద్రంలో ఎస్జీటీలకు నిర్వహిస్తున్న కౌన్సెలింగ్ ప్రక్రియ లోగుట్టుగా నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. కౌన్సెలింగ్ నిర్వహించకముందే నూతన టీచర్లకు ముందస్తుగా ఖాళీలను చూపించాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా మోసం చేశారు. అక్రమాలను ప్రశ్నిస్తారని ఉపాధ్యాయ సంఘ నాయకులను లోనికి అనుమతించ లేదు. కౌన్సెలింగ్ ప్రక్రియను అర్ధరాత్రిలో ప్రారంభించి వేకువ జాము వరకు నిర్వహించారు. ఒకే ప్రాంతంలో నూతన టీచర్లందరికీ కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించాల్సి ఉండగా, అలా చేయకుండా కొందరికి ఒక కేంద్రంలో, మరి కొందరికీ మరొక కేంద్రంలో నిర్వహించారు. తిరుపతి జిల్లా కేంద్రంలో విశ్వం పాఠశాల శిక్షణా కేంద్రంలో ఈ నెల 9న ఉదయం 4.30 గంటల వరకు 1 నుంచి 250 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. అదేవిధంగా ఈ నెల 10న మెడ్జీ స్కూల్‌లో వరుస సంఖ్య 250 కు పైన ఉన్న వారిని ఉదయం 7 గంటలకు కౌన్సెలింగ్‌కు పిలిపించి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిరీక్షింపజేశారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ ప్రక్రియను మొదలుపెట్టారు.



తిరుపతి జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి పోస్టింగ్‌ల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న విద్యాశాఖ అధికారులు

దివ్యాంగ ఉపాధ్యాయులకు అన్యాయం

డీఎస్సీలో ఎంపికైన దివ్యాంగ ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ప్రక్రియలో అన్యాయం చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో వారికున్న రిజర్వేషన్, రోస్టర్‌ల ప్రకారం ముందస్తుగా పిలువాల్సి ఉంటుంది. అయితే అలా చేయకుండా చివర్లో కౌన్సెలింగ్ నిర్వహించి దివ్యాంగ టీచర్లకు అన్యాయం చేశారు.

అవకతవకలు ఇలా...

- ఖాళీల జాబితాల్లో అవకతవకలు జరిగాయని నూతన టీచర్లు ఆరోపిస్తున్నారు. తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టీచర్లను కేటాయించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో టీచర్లనే నియమించలేదు. దీంతో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ గందరగోళంగా మారింది.
- సీఎం సొంత నియోజకవర్గం అయిన కుప్పంలోనే అవకతవలు చోటు చేసుకున్నాయి. శాంతిపురం మండలం, శెట్టిబల్ల మోడల్ ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థులున్నారు. ఆ పాఠశాలలో పోస్టులు 4 ఉన్నాయి. ఈ పాఠశాలలో ఖాళీలే లేనట్లు వేకెన్సీ జాబితాలో చూపించారు.
- శాంతిపురం మండలం శెట్టిపల్లి ప్రాథమిక మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులు 12 మందే ఉన్నారు. ఆ పాఠశాలలో శాంక్షన్ పోస్టు 1 ఉంది. అయితే ప్రస్తుత డీఎస్సీ పోస్టింగ్ ప్రక్రియ ఖాళీల జాబితాలో ఆ పాఠశాలలో 3 పోస్టులను నియమిస్తున్నట్లు చూపిస్తున్నారు.
- తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లో ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో పోస్టుల ఖాళీలను చూపించలేదు.
- సబ్జెక్టు టీచర్లు అవసరం ఉన్నప్పటికీ హెచ్‌ఆర్‌ఏ ప్రాంతాల్లో పోస్టులు ఉన్నా చూపించకుండా కౌన్సెలింగ్ నిర్వహించారు.
- తొట్టంబేడులో 1, శ్రీకాళహస్తిలో 2 ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఖాళీలు ఉన్నప్పటికీ చూపించకుండా బ్లాక్ చేశారు.

చదువు చెప్పకపోవడమే పెద్ద అవినీతి

చిత్తూరు కలెక్టరేట్ : కొందరు ఉపాధ్యాయులు తాము ఎలాంటి అవినీతికి పాల్పడము అని చెబుతుంటారని.. అయితే విద్యార్థులకు చదువు చెప్పకపోవడమే పెద్ద అవినీతి అని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. జిల్లాలో నూతన డీఎస్సీ టీచర్ల శిక్షణ ముగింపు సందర్భంగా కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీసెట్, ఆర్‌కే పాఠశాలల కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు నిబద్ధతతో విద్యాబోధన చేయాలన్నారు. జిల్లా సమగ్రశిక్షా శాఖ అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు కచ్చితంగా తమ జాబ్‌చార్ట్‌ను పాటించాలన్నారు. కార్యక్రమంలో డీవైఈవో ఇందిరా, కోర్స్ డైరెక్టర్ నాగేశ్వర రావు, ఏడీ సుకుమార్, సెక్టోరల్ అధికారులు సుభాషిణి, చాన్‌బాషా, కోర్స్ కో ఆర్డినేటర్ బాలచైతన్య పాల్గొన్నారు.

బస్సులు పంపండి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రధాని మోదీ ఈనెల 16న కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో స్కూలు, కళాశాలల బస్సులను పంపించాలని అధికారులు యాజమాన్యాలపై ఒత్తిడి తెస్తున్నారు. చిత్తూరు జిల్లా నుంచి కర్నూలుకు 360 కి.మీ దూరం. పీఎం సమావేశానికి బస్సులు పంపాలంటే ఈ నెల 15, 16, 17 తేదీల్లో సెలవులు ఇవ్వాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు. చిత్తూరు జిల్లా నుంచి 300 పాఠశాలలు, కళాశాలల బస్సులు పంపించాలని బెదిరింపులకు పాల్పడుతున్నారు.